# ఎందుకు?

హేమచంద్రుడు మంచి వంశములో పుట్టినవాడు. భాగ్యవంతుల వంశంలో జన్మించడంచేత అతనికి ఏకొఱతలేక జరుగుతుండేది. పల్నాడులో అతనికి ఒకపెద్ద మేడ ఉన్నది. ఒక తోట కూడా ఉన్నది. ఆతోటలో అనేక పుష్పజాతులున్నవి.

అతడు తెలుగులో ఇంగ్లీషులో కూడా చదువుకొన్నవాడు. ప్రకృతి అంటే అతనికి ఎక్కువ ప్రేమ. చదువుకొని తీరిక అయినప్పుడల్లా అతడు ఆతోటలో విహరిస్తూ ఉంటాడు. అక్కడ కొండవాగు జలజలమని ప్రవహిస్తూఉంటుంది. దాని ప్రక్కనే అడవి పూలచెట్లు విరివిగా పూచి ఉంటవి. ఎక్కడ కోవిలపంచమ స్వరంలో పాడుతూ ఉంటుందో, ఎక్కడ పూలు గుబురుగా పూచిఉంటవో, అక్కడ హేమచంద్రుడు ఉండి తన యౌవనహృదయాన్ని ప్రకృతి సౌందర్యామృతంతో నింపి పిపాస దీర్చుకొనేవాడు నిత్యం.

ఒకరోజు అతని సహోదరి అతనితో తోటలోకి వచ్చినది. ఒకపువ్వు కోసి యియ్యమని కోరినది. అతడు సరే యని పువ్వును కోసి ఇచ్చినాడు. కాని సుందరమైన వస్తువును పాడుచేసినానని బహు విచారపడినాడు. భౌతికవాంఛతో సహజసౌందర్యాన్ని కోమలహృదయుడు భగ్నంచేసి ఆనందించలేదు.



గోపాలం హేమచంద్రుడికి బాల్య స్నేహితుడు. చంద్రునికి ఇంకా వివాహం కాలేదు కాని గోపాలానికి భార్య కాపరానికి వచ్చింది. గోపాలం భార్య మిక్కిలి సౌందర్యవతి. ఆమె మంచి పొడగరి. గులాబీపువ్వులాంటి దేహచ్ఛాయ. అందులో పాలపొంగు వంటి ప్రాయము. ఆ చంచల వీక్షణములు, ఆయౌవన సౌందర్యము, ఆవేణీవిలాసము, ఆ పరిపుష్టి నొందిన బాహువుల సొబగు, ఎవ్వని హృదయమాకర్షించవు?

గోపాలం చంద్రాన్ని వినాయకచవితి రోజున విందుకు పిలిచినాడు. చంద్రం వెళ్ళినాడు.

ఇదివరలో చంద్రం గోపాలరి భార్యలాంటి చక్కని దాన్ని చూడలేదు. మొదటిసారి స్వజాతీయ సౌందర్యాన్ని చూచినాడు. సజీవమైన వస్తువులో అట్టి సౌందర్యమును చూచినప్పుడు అతని హృదయం, చంద్రోదయ సమయాన సముద్రము లాగ పొంగినది. ప్రేమ వాహిని బయలుదేరినది. సౌందర్యము ఆనందమిస్తుంది. ఆనంద ప్రేమకు మూలము. మనకు ఏదైతే ఆనందం యివ్వదో దాన్ని మనము ప్రేమించలేము. ప్రకృతి సౌందర్యమయము. పరమేశ్వరుడు ఆనందస్వరూపుడు. మానవహృదయం ప్రేమపిపాసామయం.

అతను గోపాలంతో విస్తరిముందు కూర్చున్నాడు.

గోపాలం భార్య వడ్డిస్తున్నది. చంద్రం ఆమెను చూస్తూ ఉండిపోయినాడు. పక్కన గోపాలం ఉన్నాడనే సంగతే అతనికి స్పృహలేదు. ఆసౌందర్యం ఇతనిని ఈడుస్తున్నది. అతని హృదయం ఆకోమలసౌందర్యాబ్ధిలో, మునిగితేలుతున్నది. ఆనందంతో ఆత్మను మేళవించినపుడు బాహ్యప్రకృతి చలింపజేయలేదు. ఆసౌందర్యమూర్తి ఎటునడిస్తే అటువైపు ఇతని దృష్టి తిరుగుతున్నది. మహాప్రవాహంలో ఎవరైనను ఎదురీదగలరా? ప్రవాహం అతనిని మహావేగంతో ఈడుస్తున్నది. అతను విస్తరిముందు కూర్చున్నాడన్న మాటేగాని ముద్ద ఎత్తలేదు. ఆసౌందర్యమనే మధువును ఒక్కొక్కబొట్టు తాగుతున్నాడు.

హేమచంద్రుని పిచ్చి చూపులు చూచి గోపాలం సిగ్గుపడ్డాడు. స్నేహితుడిని చూచి జాలిపొంది చేయవోయ్ భోజనం చెయ్యిఅని హెచ్చరించినాడు. తలవంచుకొని చంద్రం రెండుముద్దలు తిన్నాడు కాని వెంటనే ఆమె వంక చూడటం ప్రారంభించినాడు. నూపురధ్వనులతో తనజయాన్ని ప్రకటిస్తూవున్న సౌందర్యం యొక్క అద్భుత శక్తికి అతను లోబడినాడు. అతను అన్నం తినలేకపోయినాడు. గోపాలం ఇంతలో భోజనం పూర్తిచేసి లేద్దాంఅన్నాడు. చంద్రం కూడా సరేలే అన్నాడు.

ఇద్దరు గదిలోకి వెళ్ళినారు. గోపాలం భార్య తమలపాకులు తెచ్చినది. హేమచంద్రుడు ఆమె వంక మళ్ళీ చూడటం మొదలు పెట్టినాడు. గోపాలానికి చంద్రాన్ని



చూస్తే జాలేసింది. అతడు సహృదయుడని తెలియును. సౌందర్యానికి, లోబడినాడని గ్రహించినాడు. అతనిని సంతోషపెట్టదలచి భార్యను ఉద్దేశించి "ఈయన నిన్ను ఎంతసేపు చూస్తూ ఉంటాడో అంతవరకు నీవిక్కడే ఉండు" అని చెప్పి మేడపైకి పడుకోటానికి వెళ్ళినాడు.

హేమచంద్రుడు ఆమెను కొంతసేపు చూచినాడు. అతనికి తనివితీరలేదు. దాహము తగ్గలేదు. కాని ఎందుచేతనో "వెళ్ళిపో" అన్నాడు.

3

హేమచంద్రుడు గోపాలం యింటి నుంచి తన ఇంటికి వెళ్ళిపోయినాడు. తన గదిలో పరుపుపై పడుకొనినాడు. గవాక్షంలో నుంచి అతను తన తోటను చూడవచ్చును. ఆ తోటలో అనేక రకముల గులాబీ అంట్లు ఉన్నవి. చేమంతులు మల్లెలు, ఇంకా అన్ని రకముల పూలు ఉన్నవి. ఇవన్ని అతనికి ఆనందాన్ని ఇచ్చినవి. ఇవన్ని ఎల్లాగ ఆనందాన్ని ఇచ్చినవో గోపాలం భార్య అతనికి అల్లాగే ఆనందాన్ని ఇచ్చినది. ఒకమాటు తోటలోకి వెళ్ళి చూచి మళ్ళీ ఆతోటలోకి యింకొకమాటు వెళ్ళిచూడవలెనని బుద్ధి పుట్టుట సహజం. అల్లాగే అతడు సుందరిని చూడాలని బుద్ధిపుట్టినది. మళ్ళా

గోపాలం ఇంటికి వెళ్ళినాడు. గోపాలం ఇంట్లో లేడు. ఇంట్లోకి వెళ్ళినాడు. ఇతనిని చూచి పరుగెత్తికొనిపోయి తలుపు వేసుకొన్నది. సుందరి.

అతను తిరిగి ఇంటికివచ్చినాడు. తోటలో పడకకుర్చీలో కూర్చున్నాడు. తోట అతనికిపూర్వంలాగా శాంతినియ్యలేకపోయింది. ఆజంగమసౌందర్యం ఈ అచలసౌందర్యాన్ని అణగద్రొక్కింది. అతని మనోవృత్తి అదోవిధంగా మారింది. సుందరిసంఘంయొక్క కట్టుబాట్లకులోబడ్డది. ఆమెను తనఇష్టం వచ్చినన్నిసార్లు చూచుటకు వీలులేదనే విషయం ఇప్పుడు తెలిసినది. అక్కడే అతని కళ్ళుమూతలు పడ్డాయి. అప్పుడు అతడో చిన్న కలగన్నాడు. ఆకలలో సంఘరాక్షసి అతనికి కనిపించి—"చంద్రుడా, నీవు నాకట్టుబాట్లకు వ్యతిరేకంగా నడవటానికి ప్రయత్నిస్తున్నావు. మానవులందరిని నేను కొన్ని కట్టుబాట్లతో కట్టివేసితిని. ఆకట్లు తెంపినా తెగవు." అని చెప్పినది.

హేమచంద్రుడు నిద్రనుండి మేల్కొన్నాడు. అతను ఏమనుకొన్నాడంటే "దయామయుడైన భగవంతుని సృష్టిలోని వస్తువులన్నీ భోగ్యములే. రాత్రిళ్లు నక్షత్రములు కూర్చిన నీలాంబరమును కప్పుకొనియున్న ప్రకృతి సౌందర్యమును చూచి ఆనందించవలెను. పగలు పుష్పములను లతాగృహములను చూచి పక్షులగీతములు విని ఆనందించవలెను. సీతాకోక చిలుకలను చూచి రెక్కలనుపట్టుకొని మృదుత్వ



మునకును సౌందర్యమునకును అచ్చెరువొందదగునుగాని సీతాకోకచిలుక కట్టి నట్టి చీరనే కట్టుకొనియున్న మోహనమూర్తిని చూడ కూడదా?

"స్నిగ్ధ తరుచ్ఛాయల దాగి అందములేనికోయిల 'కూ' అని కూసినమాత్రాన పొంగిపోవచ్చునుగాని కోకిలారవముకన్న వేయిరెట్లు ఇంపైన సుందరకంఠధ్వని విన కుతూహలపడటం తప్పా?

పొరుగింటి వారి పెరటిలో గులాబిపువ్వును చూచినమాత్రాన నేను పాపినా? నాకుపరలోక ప్రాప్తియా? అని చంద్రుడు తలపోసెను.

హేమచంద్రుడు కుర్చీలో కూర్చున్నాడు. మందమారుతము మెల్లగా వీచినది. ప్రక్కనేకొండవాగు శ్రావణమాసము గుటచే గట్లనాని పారుతున్నది. గట్లువిరిగి కూలుతున్నవి. "అయ్యో, ఈజీవితమునకు ఈగట్లెందుకు" అని అతడనుకొన్నాడు.

"నే నేల ప్రేమించుచున్నాను!" అని అతడనుకొన్నాడు.

"నే నేల పాడుచున్నాను!"

"నే నేల వికసించుచున్నాను. నే నేల సౌరభమును వెదజల్లుతున్నాను!"

"నే నేల ఇంతవేగముతో పారుతున్నాను!" అని కేకలు అతనికి తోటలోనలుదిశలనుండివినవచ్చెను. నేనూ అట్లే సౌందర్యముకొఱకై పరితపిస్తున్నాను. అని అతని హృదయకుహరము ప్రతిధ్వనించెను. అతను అట్లే కన్నులు మూసినాడు.

## ౪

అతను ఏలనో నవ్వుతున్నాడు! అతనికి సుందరి కలలో కనిపించెను. ఆమె ఆ కొండవాగుదరిని ధవళాంబరధారిణియై అగపడెను. చూతపల్లవముల బోలు ఆ వ్రేళ్ళలో ఆమె విడ జారిన తుమ్మెదరెక్కలవంటి కేశములను చిక్కు దీసుకొనుచుండెను.

చంద్రుడు ఆమెను సమీపించెను. ఆమె నాతనిచూచి నవ్వెను. ఆనవ్వుమృదువై లజ్జాయుక్తమైయుండెను. చంద్రుడు ఆకంపించుచున్న స్వరముతో సుందరీఆగుము. నీ సౌందర్యమును నన్ననుభవింపనిమ్ము” అన్నాడు.

సుందరి:—తప్పు తప్పు! నేను నీకడ ఆగకూడదు. పర పురుషునకు నా వదనవిలోకనమే !

చంద్రుడు:—చూచుటే తప్పా! ఆగవూ. తప్పని ఎవరు చెప్పిరి ?

సుందరి:—సంఘనియమము.

చంద్రుడు:—నియమమా! దైవాజ్ఞ కాదుకదా? సుందరీ! మానవజీవితమునియమబద్ధమా? పుష్పములు ఒకదానితో మరొకటి ఏ నియమము ననుసరించి ముద్దాడుకొనుచున్నవి. గాలి ఏ నియమము ననుసరించి వీస్తున్నది. కృష్ణాస్రవంతి ఏ నియమము ననుసరించి బుద్బుదములు మలయసమీరములతో భోగించి ఐక్యమగుతున్నవి. నేను నీ సౌందర్యమును



వశుడనైనాను ఆగవూ! నీ సౌందర్యమును త్రాగనివ్వవూ!

సుందరి:—అయ్యో! నిందపాలగుదును.

చంద్రుడు:—నిందా! సుందరీ! నిందా! అయ్యో నేనేమి చేయుదును. నా మనస్సు నిర్మలమైనది. నిష్కలంకమైనది. పాపచింతలేదు. నేను సౌందర్యమును సౌందర్యముకొఱకే ప్రేమిస్తున్నాను. “ఏ సౌందర్యోపభోగమునం దింద్రియ సంబంధమైన భావోద్రేకము లేకుండునో అట్టి సౌందర్యమే సౌందర్యము” అట్టి సౌందర్యకు..................

సుందరి:—“నేను నిందపాలగుదును. నే......”

హేమచంద్రుడు మేల్కొన్నాడు. దక్షిణపుగాలికి కిటికీలు విచ్చి అల్లల్లాడుతున్నవి. ఈతని జూచి మాలతీలత ఫక్కున నవ్వినది. దాని పూలు జలజల వానిపై రాలినవి.

ఆ సౌందర్యమును అనుభవించుటకు వీలు లేదని అతనికి బోధపడెను. అట్టి సౌందర్యమును అనుభవించని జీవనము నిష్ఫలమని అతడు నిశ్చయించుకొనెను.

*            *            *            *            *            *

—ఆ సౌందర్య మనెడి దేదీప్యమానమైన ఆ అఖండ జ్యోతిముందు ఈ చిన్ని ఆముదపు దీపము ఆరిపోయినది. దరి లేని సముద్రమునుజూచి కొండవాగు తనబ్రతుకు దుస్సహమని తలచి ఒక్కమారు అందరు దృష్టికి అంతరించింది.

సంపూర్ణము